'కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి'

సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ

కోదాడ టౌన్, మార్చి 3: కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశ్య పద్మ డిమాండ్ చేశారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో నిర్వహించిన కౌలు రైతుల సంఘం నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామసభల్లో కౌలు రైతులను గుర్తించి భూమి ఉన్న రైతులతో పాటుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని అన్నారు. మార్చి 10న దేశవ్యాప్తంగా చేపట్టనున్న ధర్నాలో కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పాజు సూర్యనారాయణ, బొల్లు ప్రసాద్, జక్కుల రామారావు, బానోతు నెహ్రూ, బండమీది వెంకన్న, వెంకటేశ్వర్లు, వెంకట య్య, శ్రీనివాస్, పాపిరెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేరేడుచర్ల, మార్చి 3: మండలంలోని మేడారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులుగా, అధికారులుగా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పరశురాములు, ఉపాధ్యాయులు నవ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, గుర్వయ్య, శ్రీనివాస్‌రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణరావు

మోతె, మార్చి 3: మండలంలోని అన్నారిగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఉన్నం సత్యనారాయణరావు నామవరం, రావిపహాడ్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష ప్యాడ్లు, కంపాస్ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోటు మోహనరావు, వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బీఎల్ ఎన్.చారి, రాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణలో అన్ని కులాలకు న్యాయం చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న చింత వినయ్‌బాబు మాదిగ

సూర్యాపేట టౌన్, మార్చి 3: రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన ఎస్సీ వర్గీకరణ నివేదికలోని లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కందుకూరి సోమన్న, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ బోడ సునీల్, ఎంఎస్‌పీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌బాబు మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. నివేదికలో 59 ఉపకులాలకు సామాజిక న్యాయం జరగలేదని, లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. కాగా, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించే మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చింతలపాటి చిన శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, ఒగ్గ విశాఖ, కొండపల్లి ఆంజనేయులు, గంట భిక్షపతి, మాదాసు గోపి, వినోద్, విజయ్, ప్రసాద్, రాజు, రవీంద్ర, వెంకన్న, కృష్ణ, నవీన్, సతీశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

మునగాలలో రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త

మునగాల, మార్చి 3 : గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రం మునగాలతో పాటు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ఎక్కడ చూసిన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వాటిలో కుక్కలు, పందులు సంచరిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతున్నదని, దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్నది. ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు రాకపోవడం ఒక కారణం కాగా, కార్యదర్శులకు 2 నుంచి 3 గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పజెప్పడంతో వారు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇటీవల మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బజారులో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్నదని ఓ వ్యక్తి కార్యదర్శికి దృష్టికి తీసుకుపోగా పట్టించుకోకపోవడంతో తాసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఆ సమస్యను పరిష్కరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామాలలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ కవర్లు సీజ్

నేరేడుచర్ల, మార్చి 3: నేరేడుచర్ల మున్సిపల్ వార్డు అధికారులు సోమవారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న, సింగిల్ యూస్ కవర్లను సీజ్ చేసి పలువురు దుకాణదారులకు జరిమానాలు విధించారు. నిషేధిత కవర్లు విక్రయిస్తే దుకాణం లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

నకిరేకల్, మార్చి 3 : బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన నకిరేకల్ పట్టణంలోని బైపాస్‌లో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపహాడ్ గ్రామానికి చెందిన నల్లగొండ ప్రభు(25) ఆటోడ్రైవర్. భార్యతో విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన పులగుజ్జు నరేశ్, సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన వైష్ణవి(24) ఎనిమిదేండ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. వైష్ణవి భర్తతో మనస్పర్థలు రావడంతో పిల్లలను తీసుకొని టేకుమట్ల గ్రామంలోని తన తల్లిగారి ఇంటి వద్దకు వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో నల్లగొండ ప్రభు, పులగుజ్జు వైష్ణవి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఆదివారం సాయంత్రం ప్రభు వైష్ణవిని తీసుకుని బైక్‌పై నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టుకు వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమవగా నకిరేకల్ బైపాస్‌లోని తాటికల్ ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దాంతో ప్రభు, వైష్ణవి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ లచ్చిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.మృతదేహాలను ఫోరెన్సిక్ పరీక్షల కోసం నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్

న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్

హుజూర్‌నగర్, మార్చి 3: హుజూర్‌నగర్ కోర్టు ప్రాంగణంలో ఈ నెల 8వ తేదీన జరుగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ కోరారు. సోమవారం న్యాయవాదులు, పోలీసులతో వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులను రాజీ చేసి సూర్యాపేట జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, అదే స్ఫూర్తితో ఈసారి కూడా ఎక్కువ కేసులను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బొబ్బా కోటిరెడ్డి, కోర్టు అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాది రేణుక , న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రాఘవరావు, ప్రదీప్తి, సంధ్య, వెంకట్‌రెడ్డి, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, నియోజకవర్గంలోని వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

ఓట్ల అవకతవకలపై అధికారుల పరిశీలన

ఓటర్ల వివరాలు సేకరిస్తున్న అధికారులు

మఠంపల్లి, మార్చి 3: మండలంలోని కిందితండా గ్రామ పంచాయతీలో ఓటర్ల లిస్టులో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులు అందడంతో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, ఎంపీడీఓ జగదీశ్, ఇతర అధికారులు ఇంటింటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. కిందితండాలో ఇంటింటికి తిరిగి 545 ఓట్లు ఉన్నట్లు గుర్తించామని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు.

విద్యార్థులకు తల్లిదండ్రులు సహకరించాలి : ఎంఈఓ

పరీక్షలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ సలీంషరీఫ్

కోదాడ రూరల్, మార్చి 3: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని మండల విద్యాధికారి ఎండీ.సలీంషరీఫ్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులకు పరీక్షలపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు బలమైన ఆహారం అందించాలని, సరైన నిద్ర ఉండేలా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి హెచ్ఎం డి.మార్కండేయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి : మున్సిపల్ కమిషనర్

పన్ను వసూలు చేస్తున్న కమిషనర్ యాదగిరి

తిరుమలగిరి, మార్చి 3: ప్రజలు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ యాదగిరి కోరారు. సోమవారం మండల కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది చేపట్టిన ఇంటి పన్ను వసూళ్ల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు సోమ్మల్లు, పాండు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ నీలిమ

అర్వపల్లి, మార్చి 3: ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలు, ఏటీఎం పిన్ నంబర్లు సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దని షీ టీమ్ ఎస్ఐ నీలిమ సూచించారు. సోమవారం అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీ టీమ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ నీలిమ మాట్లాడుతూ.. లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకూడదని పేర్కొన్నారు. మహిళలను ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే షీ టీమ్ నంబర్ 8712686056కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఏఎస్ఐ రాములు, కానిస్టేబుల్ శ్రీను, రవి, మల్లేశం, ఎల్లయ్య, కృష్ణచారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట టౌన్, మార్చి 3: బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆలేటి ఆటం వరల్డ్ అనాథ, మానసిక వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకులు చింటు, కిరిటీ, బాలాజీ, బాచి, అఖిల్, గిరి పాల్గొన్నారు.

స్నేహితుల జ్ఞాపకార్థం..

జిల్లా కేంద్రానికి చెందిన దాసరి వినయ్, తన్నీరు సంతోశ్, సుంకి సాయికుమార్ ఇటీవల మరణించగా.. వారి స్నేహితులు పరిక విజయ్, భానుప్రసాద్, దాసరి విక్రమ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో జగదీశ్, తన్నీరు రాధిక, మున్ను, గోసుల సరిత తదితరులు పాల్గొన్నారు.

'మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలి'

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

సూర్యాపేట టౌన్, మార్చి 3: హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ నుంచి గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వరకు పదివేల మంది తెలంగాణ ఉద్యమకారులతో ఈ నెల 10న నిర్వహించే గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల మహిళా వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు కోతి మాధవరెడ్డి, మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి లింగయ్య, ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కోడి సైదులుయాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో మిలియన్ మార్చ్ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీ మేరకు 250 గజాల స్థలంతో పాటు రూ.30 వేల గౌరవభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే.యూసుఫ్‌షరీఫ్, సహాయ కార్యదర్శి మేడబోయిన గంగయ్య, జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి మురళి, ప్రధాన కార్యదర్శి అమ్మనాయక్, ఉపాధ్యక్షుడు ఎస్‌కే.సయ్యద్, ఉద్యమకారుల జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి అంజయ్య, ప్రధాన కార్యదర్శి బారీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కోదాడ రూరల్, మార్చి 3: ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోదాడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధి హుజూర్‌నగర్ రోడ్డులోని పశువుల సంత ఎదురు వీధిలో నివాసం ఉంటున్న సుతారి మేస్త్రీ వేముల బాలరాజు (33) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుట్టు మిషన్ పని నిమిత్తం బయటకు వెళ్లిన భార్య తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి బాలరాజు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కాగా, బాలరాజుకు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూర్.ఎస్, మార్చి 3: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని పాతర్లపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పాతర్లపహాడ్‌కు చెందిన గీత కార్మికుడు బత్తుల రమేశ్ సోమవారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. గమనించిన తోటి గీత కార్మికులు వెంటనే సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తున్నారు.

ఎల్ఆర్ఎస్ కాల్ సెంటర్ ఏర్పాటు

సూర్యాపేట టౌన్, మార్చి 3: సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బోళ్ల శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై 25 శాతం రాయితీ కల్పించిందని వివరించారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి గతంలో దరఖాస్తు చేసిన వారు తమ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవాల్సిందిగా సూచించారు.

డబ్బు డిమాండ్ చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

సూర్యాపేట టౌన్, మార్చి 3: జిల్లా కేంద్రం సూర్యాపేటలోని పశువుల సంతకు వచ్చే రైతులు, వ్యాపారులను బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తిపై సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. తెలిసిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణానికి చెందిన సోమయ్య అనే వ్యక్తి మూడు నెలల క్రితం పోలీసులకు సమాచారం అందించి గేదెలను తరలిస్తున్న వాహనాలపై కేసులు నమోదు చేయించాడు. అప్పటి నుంచి పోలీసులు తనకు తెలుసని సంతకు వచ్చే వ్యాపారులను, రైతులను బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలోనే సోమవారం సంతలో పలువురిని బెదిరించగా పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సోమయ్యను స్టేషన్‌కు తరలించారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

మేళ్లచెర్వు, మార్చి 3: మహా శివరాత్రిని పురస్కరించుకొని మేళ్లచెర్వులోని ఇష్ట కామేశ్వరీ సహిత శంభులింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి పవళింపు సేవ వైభవంగా జరిగింది . ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక ఊయలపైకి చేర్చి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వేడుకలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి మొత్తం రూ. 39,54,127 ఆదాయం వచ్చింది. జాతర సందర్భంగా దాతల సహకారంతో నిర్వహించిన ఎద్దుల పందేలు, కబడ్డీ పోటీలు ప్రజలను అలరించాయి.

'వినికిడి నిర్ధారణ పరీక్షలను వినియోగించుకోవాలి'

సూర్యాపేట టౌన్, మార్చి 3: ప్రాథమిక దశలోనే వినికిడి సమస్యను గుర్తించి వైద్య పరీక్షలు చేయించుకుంటే సమస్యను నివారించుకోవచ్చని ఆడియాలజిస్టు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని రాయల్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్‌లో ఉచిత వినికిడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో వినికిడి సమస్య రోజురోజుకూ పెరుగుతున్నదని, మొదటి దశలోనే గుర్తిస్తే నివారించవచ్చన్నారు. ప్రతి వారం వినికిడి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమయ పాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌కు ఎమ్మెల్యే సామేలు ఫిర్యాదు

ఫోన్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

తుంగతుర్తి, మార్చి 3: విద్యాలయాల్లో సమయ పాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే మందుల సామేలు ఫిర్యాదు చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. 29 మంది టీచర్లకు కేవలం ఆరుగురు మాత్రమే విధులకు హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. కలెక్టర్‌కు ఫోన్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు.

ఆర్థిక సాయం

నూతనకల్: మండలంలోని గుండ్లశింగారం గ్రామానికి చెందిన సలీమా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం సలీమాకు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇందిరమ్మ ఇల్లు, సలీమా ఇద్దరి పిల్లల చదువులకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● జిల్లా గిరిజన సంక్షేమాధికారి శంకర్

హాజరు పట్టికను పరిశీలిస్తున్న జిల్లా గిరిజన సంక్షేమాధికారి శంకర్

తుంగతుర్తి, మార్చి 3: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా గిరిజన సంక్షేమాధికారి శంకర్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, హాజరు పట్టికలను పరిశీలించి మాట్లాడారు. ఎమ్మెల్యే సామేలు పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో టీచర్లు పాఠశాలకు రాకపోవడంపై కలెక్టర్‌కు ఫోన్‌లో సమాచారం అందించడంతో పాఠశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. తగిన చర్యల నిమిత్తం కలెక్టర్‌కు నివేదికను పంపించనున్నట్లు పేర్కొన్నారు.

'మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి'

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కళా బృందం సభ్యులు

తిరుమలగిరి, మార్చి 3: గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ తెలంగాణ సాంస్కృతిక కళా బృందం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని కన్నారెడ్డికుంట తండా గ్రామ పంచాయతీలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీమ్ లీడర్ పాలకుర్తి శ్రీకాంత్ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు ఈర్ల సైదులు, గడ్డం ఉదయ్, వెన్నెల నాగరాజు, మాగి శంకర్, పాక ఉపేందర్, మెడిపల్లి వేణు, మద్దిరాల మంజుల, సరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, పోతరాజు శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

సూర్యాపేట రూరల్, మార్చి 3: మండలంలోని బాషనాయక్‌తండాలో సోమవారం రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాషనాయక్‌తండాకు చెందిన సంకెళ్లబట్ల రామ్‌కుమార్ ఇటీవల ఊరికి వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చి చూసేసరికి దొంగలు ఇంటి తలుపు తాళం పగులగొట్టి ఇంట్లోని 17 గ్రాముల బంగారు పుస్తెలతాడు అపహరించారు. అదేవిధంగా వల్లూరి శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 17 గ్రాముల బంగారు బ్రాస్లెట్, ఒక ఉంగరం చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ బాలునాయక్ తెలిపారు.

చిలుకూరులో ధ్యానోత్సవం ప్రారంభం

చిలుకూరు, మార్చి 3: శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్తంగా చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ధ్యానోత్సవం కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా మిషన్ కోఆర్డినేటర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్